




కింద పడేసి తంతూ..
తీవ్ర గాయాలతో..




దాడికి తెగబడుతూ..


విచక్షణ కోల్పోయిన మంద ఇదే..

సిద్ధం.. ఉన్మాదం..!

రెచ్చగొట్టిన జగన్

ప్రజాస్వామ్యంలో ఎన్నికలు ఓ భాగం. కానీ దురదృష్టవశాత్తూ దీన్ని అధికార పార్టీ 'యుద్ధం' అని వర్ణిస్తోంది. దానికి 'సిద్ధం' అని రెచ్చగొట్టడం మొదలుపెట్టింది. పార్టీ శ్రేణులకు మద్యం పోసి.. మాంసాహారం తినిపించి.. బయటకు వదులుతోంది. ఈ తీరు ప్రజాస్వామ్య మనుగడకు ముప్పుగా పరిణమిస్తోంది. రాజకీయాలతోనూ, పార్టీలతోనూ ఏ సంబంధమూ లేని ఓ నిఖార్సయిన ఫొటో జర్నలిస్టుపై పాశవిక దాడికి కారణమైంది. అతడి ప్రాణాలమీదకు తెచ్చింది. రాప్తాడులో జరిగిన వైసీపీ రాయలసీమ స్థాయి సభ.. సీమ సంస్కృతి, సంప్రదాయాలకు మాయని మచ్చగా మిగిలిపోయింది.



మీడియాను శత్రువుగా వర్ణించిన సీఎం
రెచ్చిపోయిన వైసీపీ అల్లరి మూకలు
ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్‌పై దాడి
తీవ్రంగా గాయపడిన ఫొటో జర్నలిస్టు శ్రీకృష్ణ
ఖండించిన జర్నలిస్టులు, ప్రజా సంఘాలు, విపక్షాలు

అనంతపురం, ఫిబ్రవరి 18(ఆంధ్రజ్యోతి): రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభ నిర్వహణకు మందు, మాంసం, డబ్బులు, అధికార బలం ఇంధనంగా మారాయి. ఆర్టీసీ బస్సులు, ప్రైవేట్ విద్యాసంస్థల బస్సులను సభకోసం వినియోగించారు. వీధి వీధికీ, ఊరూరుకీ పంపించారు. చాలామందికి మందు పోసి, మాసం తినిపించి మరీ బస్సులు ఎక్కించారు. ఈ కారణంగా ఆర్టీసీ బస్సులు లేక సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు సభ ప్రారంభమైన కాసేపటికే జనం జారుకున్నారు. బలవంతంగా వచ్చినవారు సీఎం ప్రసంగం మొదలవ్వకనే తిరుగుటపా కట్టారు. ఆదివారం మధ్యాహ్నమే సభాప్రాంగణానికి చేరుకున్న జనం, ఎండవేడిమికి అల్లాడిపోయారు. కార్యకర్తల కోసం ఏర్పాటు చేసిన గ్యాలరీలు కొన్ని ఖాళీగా కనిపించాయి.


స్తంభించిన ట్రాఫిక్

సిద్ధం సభ కారణంగా జాతీయ రహదారిపై ట్రాఫిక్ స్తంభించింది. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఇదే పరిస్థితి కనిపించింది. బెంగళూరు-హైదరాబాద్ జాతీయ రహదారి, అనంతపురం-కదిరి రహదారిపై ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నగరానికి అటూ ఇటూ కిలోమీటర్ల పొడవున వాహనాలు నిలిచిపోయాయి. సభా వేదికకు సుమారు దూరంగా పార్కింగ్ ఏర్పాటు చేయడంతో జనం ఇబ్బందులు పడ్డారు. కిలో మీటర్లకొద్దీ నడిచి సభాస్థలికి వచ్చారు. మహిళలు మరింత ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

శ్రీకృష్ణ.. జిల్లాలో అన్ని పార్టీల నాయకులకు సుపరిచితుడు. మృదు స్వభావి. ఎవరి చెడూ కోరుకోడు. తన పని తాను చేసుకుపోతాడు. సుమారు రెండు దశాబ్దాల నుంచి ఆంధ్రజ్యోతికి సేవలు అందిస్తున్నాడు. కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు.. ఇలా అన్ని వర్గాల సమస్యలను కళ్లకు కట్టేలా కెమెరాలో బంధించే శ్రామికుడు. ప్రభుత్వానికీ.. ప్రజలకు మధ్య తన ఫొటోలతో వారధి నిర్మిస్తాడు. సమస్యల పరిష్కారానికి తనవంతుగా పనిచేస్తాడు. అలాంటి వ్యక్తిపై పాశవిక దాడి జరిగింది. ఉన్మాద చర్యలకు పాల్పడినవారికి అతని ప్రతిభ, చిత్తశుద్ధి ఏమిటో తెలియదు. ఆ మాటకొస్తే.. అతని పేరు కూడా తెలియదు. వ్యక్తిగతంగా ఏ శత్రుత్వమూ లేదు. అయినా దాడి చేశారంటే.. వారిని ఉన్మాదులు అనక ఇంకేమనాలి..? గుంపులో ఉన్నాం.. పార్టీ అధికారంలో ఉంది..! కొట్టేద్దాం.. చంపేద్దాం.. అనుకునే పిరికివాళ్ల మంద ఇది. ఇలాంటి వారిని ఉపేక్షిస్తే.. ప్రజాస్వామ్యపు నాలుగో స్తంభాన్ని నామరూపాల్లేకుండా చేస్తారు. సందేహమే లేదు.


వైసీపీ శ్రేణుల పాశవిక దాడి..

ఇదేం సభ బాబోయ్..!


ఇరుక్కుపోయిన 108

- సిద్ధం సభ వాహనాల రద్దీలో 108 అంబులెన్స్ ఇరుక్కుపోయింది. రుద్రంపేట నుంచి రాప్తాడు బైపాస్ కూడలి వరకూ వైసీపీ జనసమీకరణ వాహనాలతో ట్రాఫిక్ జామ్ కావడంతో దాదాపు గంటపాటు 108 వాహనం కదల్లేకపోయింది.
- జాతీయ రహదారిపై డివైడర్ల మధ్య నాటిన చెట్లకు వైసీపీ వర్గీయులు నిప్పు పెట్టారు. దీంతో చెట్లు కాలి బూడిదయ్యాయి.
- సభకు వచ్చిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు బైపాస్ రోడ్డు వెంట, సభా ప్రాంగణం, వాహనాల్లో మద్యం సేవించారు. మత్తులోకి జారుకుని వికృత చేష్టలు చేశారు.
- సీఎం జగన్ ప్రసంగిస్తున్న సమయంలో గ్యాలరీలు సగం కూడా భర్తీకాలేదు. గ్రీన్ కార్పెట్‌తో ఖాళీగా దర్శనమిచ్చాయి. మండే ఎండలో జనం ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- సభకు వచ్చిన వైద్య విభాగం సిబ్బందికి కనీస వసతి ఏర్పాటు చేయలేదు. దీంతో కొందరు వాహనాల నీడలో నిలబడ్డారు. మరి కొందరు ఎండలోనే నిలబడ్డారు. ప్రభుత్వ కార్యక్రమం కాకపోయినా తమను బలవంతంగా తీసుకువచ్చారని కొందరు వాపోయారు.


తాగుతూ.. ఊగుతూ..


ప్రయాణికులతో నిండిపోయిన అనంతపురం ఆర్టీసీ బస్టాండు

\- అనంతపురం సెంట్రల్



తిను.. తాగు.. బస్సెక్కు..!

సిద్ధం సభకు జనాలను తరలించడానికి వైసీపీ నాయకులు భారీగా ఖర్చు చేశారు. యాడికిలో ఇద్దరు నాయకులు జన సమీకరణకు మద్యం, మాంసాహారాన్ని ఎరగా వేశారు. 'ఆదివారం కదా.. ఇంటి దగ్గర ఉండి ఏంచేస్తావబ్బా..! మందు తాగుతావా? తాగు..! చికెన్ తింటావా..? తిను..! ఇవన్నీ అయిపోయాక బస్సు ఎక్కి కూర్చో..! సీఎం సభకు వెళ్లి వద్దాం' అని నాయకులు ఫోన్ చేసి మరీ పిలిపించుకున్నారు. - యాడికి

ఎయ్.. మందెయ్..!



సిద్ధం సభ మందుబాబులకు పండుగ తెచ్చింది. వైసీపీ నాయకులు, కార్యకర్తలు విచ్చలవిడిగా మద్యం తాగి హల్‌చల్ చేశారు. వైసీపీ నాయకులు ముందుగానే అందించిన మద్యాన్ని కొందరు బస్సుల్లోనే తాగేశారు. చెన్నేకొత్తపల్లి నుంచి ఎన్ఎస్ గేటు వరకూ జాతీయ రహదారి పొడవునా రోడ్ల పక్కన, దాబాల వద్ద బస్సులను ఆపి.. కర్ణాటక మద్యం తాగుతూ, బిర్యానీ తింటూ కనిపించారు. సీకే పల్లిలోని ప్రధానరహదారి పక్కనే బహిరంగంగా మద్యం సేవించి.. ప్రజలను ఇబ్బందిపెట్టారు. - చెన్నేకొత్తపల్లి



వైద్యశాలే.. వంటశాల

బొమ్మనహాళ్ మండలం గోవిందవాడలో పశువైద్యశాలను వంటశాలగా మార్చేశారు. సిద్ధం సభకు వెళ్లేవారికి వైసీపీ నాయకులు ఇక్కడే బిర్యానీ తయారు చేయించారు. పశువైద్యశాల వరండాలో వంట చేశారు.

\- బొమ్మనహాళ్



ధర్నా చేస్తున్న వామపక్ష విద్యార్థి సంఘాలు

వెంటనే చర్యలు తీసుకోవాలి

ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ డిమాండ్

రాప్తాడు సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి తెగబడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సీఎం సభలో జరిగిన ఈ దాడికి నిరసనగా వారు నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం రాత్రి ధర్నా చేశారు. పోలీసుల సమక్షంలోనే దాడి జరిగినా దుండగులను అరెస్టు చేయకపోవడం దారుణమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక గత ఐదేళ్లలో అనేక చోట్ల జర్నలిస్టులపై దాడులు జరిగాయని అన్నారు. వైసీపీ నాయకుల చర్యలు అనైతికమని మండిపడ్డారు. రాజ్యాంగం కల్పించిన స్వేచ్ఛను వైసీపీ నాయకులు హరిస్తున్నారని విమర్శించారు.

\- అనంతపురం విద్య



పరామర్శిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ, జర్నలిస్టు సంఘాల నాయకులు


పరామర్శిస్తున్న టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్

ఏం చేశారో.. ఏం చేస్తారో..!

సిద్ధం సభకు రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాల నుంచి జనాన్ని తరలించారు. ఈ వేదికపై సీమకు ఏమేం చేశారో చెప్పలేదు. మళ్లీ అధికారం ఇస్తే ఏం చేస్తారో కూడా చెప్పలేదు. పెండింగ్ ప్రాజెక్టులు, కరువు, వ్యవసాయ సంక్షోభం, వలసలు.. ఇలా అనేక సమస్యలు సీమను పట్టి పీడిస్తున్నాయి. వీటి గురించి సీఎం జగన్ ప్రస్తావించనేలేదు. ఈ సభకు వచ్చిన రాయలసీమ ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నాయకులు కూడా మౌనం వహించారు. ఎన్నికల సమయం కదా..! ఇది ఎన్నికల ప్రచార సభ కదా..! ఏదో ఓ కార్యాచరణ ప్రకటిస్తారని భావించిన జనం.. ఉసూరుమన్నారు.

అవే బేలమాటలు

సిద్ధం సభలో సీఎం జగన్ పచ్చి అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేశారు. రైతులు, మహిళలు, విద్యార్థులు, వృద్ధులకు టీడీపీ హయాంలో ఎలాంటి పథకాలు అమలు చేయలేదని అన్నారు. తన పాలనలోనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. ఎప్పటిలాగే చంద్రబాబు, పవన్ కల్యాణ్, మీడియాపై అక్కసు వెళ్లగక్కారు. పేదవాడికి.. పెత్తందార్లకు మధ్య యుద్ధం జరగబోతోందని అన్నారు. సుసంపన్నుడైన జగన్.. పేదవాడా..? ఇసుక, మట్టి, భూ దందాలతో రూ.కోట్లు కొల్లగొట్టిన ఆయన పార్టీ నాయకులు పేదవారా..? ఈ చర్చ జనంలో జరుగుతోంది. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీలు 99 శాతం అమలు చేశామని ఆయన పార్టీ శ్రేణులకూ అబద్ధాలే చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే సంక్షేమం, అభివృద్ధి పథకాలన్నీ ఆగిపోతాయని కూడా బెదిరించారు. కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు ఏ గ్రామంలోనైనా చంద్రబాబు మార్క్ లేదని, తన మార్క్ మాత్రం ఉందని ఊదరగొట్టారు. వచ్చే ఎన్నికల్లో 175 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని కార్యకర్తలతో అన్నారు.


టీడీపీ నాయకుల పరామర్శ

మద్యం.. సిద్ధం

వైసీపీ సిద్ధం సభ మద్యం సభగా మారింది. ఎక్కడ చూసినా కర్ణాటక, ఏపీ మద్యం బాటిళ్లు, ప్యాకెట్లు కనిపించాయి. రాప్తాడు సభ వద్దకు చేరుకున్న వైసీపీ శ్రేణులకు తాగినంత మందు పోశారు. బిర్యానీ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు కూడా సరఫరా చేశారు. ఎక్కడ పడితే తాగుతున్నా పోలీసులు చూసీ చూడనట్లుగా వ్యవహరించారు.

\- రాప్తాడు


సభ నుంచి వెళ్లిపోతున్న మహిళలు


సిద్ధం సభకు వచ్చి.. తాగుతూ..

కలెక్టరేట్ ధర్నాకు సిద్ధం కండి

గొంతెత్తి ప్రభుత్వాన్ని నిలదీద్దాం
రౌండ్ టేబుల్ సమావేశంలో ఏపీ జేఏసీ నేతలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 18: రాష్ట్ర ప్రభుత్వం సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో ఈనెల 20న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాకు సిద్ధం కావాలని ఏపీ జేఏసీ నాయకులు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్, కార్మిక సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. ఆదివారం ఎన్జీఓ హోంలో ఏపీజేఏసీ ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ జేఏసీ జిల్లా చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో భాగంగా ఇచ్చిన సీపీఎస్‌ను రద్దు చేయకుండా తీరని మోసం చేశారని మండిపడ్డారు. అన్ని ప్రభుత్వశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయకుండా వారి సర్వీసును అధోగతిపాలు చేస్తున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న 16వ పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం 12వ పీఆర్సీ ప్రకటించాలన్నారు. లేనిపక్షంలో ఐఆర్ ప్రకటించాలన్నారు. సరెండర్ లీవులు వెంటనే అమలుచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏలతోపాటు డీఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. కాంట్రాక్ట్ ఎంప్లాయిస్‌కు ఎలాంటి నియమనిబంధనలు లేకుండా ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు వారిని వెంటనే రెగ్యులర్ చేయాలన్నారు. డిమాండ్లను పరిష్కరించాలని కోరితే పోలీసులతో ఉద్యమాలను అణచివేయాలని ప్రభుత్వం చూడటం బాధాకరమన్నారు. ఎంత అణచివేతకు గురిచేసినా ఉద్యమం ఆగదని హెచ్చరించారు. సమావేశంలో ఏపీ జేఏసీ కన్వీనర్ చంద్రమోహన్, ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నరసింహులు, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు పెద్దనగౌడ్, కార్యదర్శి జయరామప్ప, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి లింగమయ్య, ఏపీటీఎఫ్ 1938 నాయకులు రవీంద్ర, శ్రీనివాసులు రెడ్డి, ట్రెజరీ ఎంప్లాయిస్ అధ్యక్షుడు ఫరూక్ అహ్మద్, ఆర్టీసీ ఉద్యోగుల చైర్మన్ సూరిబాబు, కమర్షియల్ ట్యాక్సెస్ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్‌బాబు, జిల్లా నాయకులు శాంతముని, పంచాయతీ రాజ్ యూనియన్ అధ్యక్షుడు నాగభూషన్‌రెడ్డి, ఇరిగేషన్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్స్ జిల్లా కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా ఎన్జీఓ ఉమెన్‌వింగ్ చైర్‌పర్సన్ జమీలాబేగం, అగ్రికల్చర్ ఎంప్లాయిస్ నాయకులు రవికుమార్, ప్రసాద్, జిల్లా ఎన్జీఓ నాయకులు ప్రవీణ్‌కుమార్, శోభారాణి, లింగమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న ఏపీ జేఏసీ నాయకులు



రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడిచేస్తున్న వైసీపీ మూకలు

తీవ్రంగా గాయపడిన స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ

దాడి హేయమైన చర్య

పాత్రికేయులకు రక్షణ లేకపోతే ఎలా..?

టీడీపీ, జనసేన, బీజేపీ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, విద్యార్థి, కులసంఘాల నాయకులు

ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడికి ఖండన

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 18

రాప్తాడులో నిర్వహించిన సిద్ధం బహిరంగ సభలో ఉన్న ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ అల్లరిమూకలు విచక్షణారహితంగా దాడి చేయడం హేయమైన చర్యని పలువురు రాజకీయ, విద్యార్థి, కులసంఘాల నాయకులు మండిపడ్డారు. విధి నిర్వహణలో ఉన్న అతడిపై కర్రలు, పిడిగుద్దులతో దాడి చేసిన తీరు ప్రతిఒక్కరిని కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు స్థానికంగా ఉన్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరించడంతోనే దారుణం జరిగిందని మండిపడ్డారు. దాడి చేసిన వైసీపీ అల్లరిమూకలను వెంటనే అరెస్టు చేసి శ్రీకృష్ణ మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. పలువురు రాజకీయ నాయకులు నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకృష్ణను పరామర్శించి మెరుగైన వైద్యమందించాలని వైద్యులకు సూచించారు. మాజీ మంత్రి పరిటాల సునీత ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను ఫోన్ ద్వారా పరామర్శించారు. కుటుంబసభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా వైసీపీ గూండాలు చేసిన దాడిని ఆమె తీవ్రంగా ఖండించారు.

అదే విధంగా ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్‌ల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసనకు దిగారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరవధిక దీక్షకు దిగుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శ్రీకృష్ణపై జరిగిన దాడిని ఖండించిన వారిలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గాజుల ఆదెన్న, మాజీ మేయర్ స్వరూప, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మోద్దీన్, శింగనమల టూమెన్ కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు, శింగనమల నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణిశ్రీ, టీఎన్‌టీయూసీ నాయకులు కుంచెపు వెంకటేష్, పోతుల లక్ష్మీనరసింహులు, టీడీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల క్రిష్ణయ్య, ధర్మవరం టౌన్ అధ్యక్షుడు పరిసే సుధాకర్, రాష్ట్ర కార్యదర్శులు కమతం కాటమయ్య, తలారి ఆదినారాయణ, వెంకటశివుడు యాదవ్, జేఎల్ మురళీధర్, బుగ్గయ్య చౌదరి, టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎస్ రాజు, శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన టీడీపీ రాష్ట్ర వడ్డెర సాధికార సమితి కన్వీనర్ వడ్డే వెంకట్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కొల్లకుంట అంజినప్ప, జిల్లా కార్యదర్శి సాముకోటఆది, నాయకులు సంగా సుధాకర్, జనసేన జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్, నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు, జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, డీసీసీ అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు దాదాగాంధీ, ఏపీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆయూఫ్, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి, ఏపీఎన్జీఓ నగర అధ్యక్షుడు, ఇరిగేషన్ రాష్ట్ర కార్యదర్శి మనోహర్‌రెడ్డి, వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటేశులు, ఏపీయూడబ్ల్యూజే నేషనల్ కౌన్సిల్ మెంబర్ గుత్తా ప్రభాకర్‌నాయుడు, టీడీపీ బీసీ లీడర్ ఎండీ నాగభూషణం, న్యాయవాది హరి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చిరుతల మల్లికార్జున తదితరులు ఉన్నారు.

దురదృష్టకరమైన సంఘటన



శ్రీకృష్ణపై పైశాచికంగా దాడి చేస్తున్నా పోలీసులు చూసీచూడనట్లు వ్యవహరించడం దారుణం. ఈ ఘటనకు ఎస్పీ పూర్తి బాధ్యత వహించాలి. ముఖ్యమంత్రి సభలో జరిగిన ఈ ఘటనకు సీఎం కూడా బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అధికారముందనే అహంకారం, మేమేమి చేసినా ఎవరూ ఏమనరు.. కేసులు పెట్టరు... పోలీసులు మా చేతుల్లో ఉన్నారనే దురహంకారమా..? దుర్మార్గాలు, దాష్టికాలను చేయడం సరైనది కాదు. వైసీపీ నాయకులకు పోయే కాలం దాపురించింది. పోలీసులు వీడియోలు తెప్పించుకొని దాడులకు పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాలి. లేదంటే అన్ని రాజకీయ పార్టీలతో కలిసి భవిష్యత్తు కార్యచరణ ప్రకటించాల్సి ఉంటుంది.

- కాలవ శ్రీనివాసులు, మాజీ మంత్రి

దాడి దుర్మార్గమైన చర్య



దాడి చేయడం దుర్మార్గమైన చర్య. విధి నిర్వహణలో తన పని తాను చేసుకుంటున్న శ్రీకృష్ణపై దాడి చేయడం చూస్తుంటే అదేపనిగా చేసినట్లు ఉంది. ఈ దాడితో మున్ముందు మరిన్ని దాడులకు తెగబడుతామని సీఎం జగన్ ముందస్తు సంకేతాలు పంపినట్లయింది. దాడి జరుగుతున్న సమయంలో పోలీసులు అక్కడే ఉన్నప్పటికీ పట్టించుకోకపోవడం దారుణం. ఇప్పటికే పోలీసులు వైసీపీకి కార్యకర్తలు ఉన్నారన్న అపకీర్తిని మూటగట్టుకుంటున్నారు. దాడిచేసిన వారిని అరెస్టు చేసి ఇప్పుడైనా నిష్పక్షపాతంగా వ్యవహరించి ఆ అపకీర్తిని తొలగించుకోవాలి. లేదంటే అన్ని పార్టీల ఆధ్వర్యంలో విలేకరులకు అండగా పోరాటాం చేయాల్సి ఉంటుంది.

- బీకే పార్థసారథి, శ్రీసత్యసాయి జిల్లా టీడీపీ అధ్యక్షుడు

నియంతృత్వ పోకడలకు నిదర్శనం



జగన్ నియంతృత్వ పోకడలకు శ్రీకృష్ణపై దాడే నిదర్శనం. సిద్ధం కార్యక్రమంలో మీడియా మిత్రులపై దాడికి పాల్పడుతుంటే అడ్డుకున్నందుకు శ్రీకృష్ణపై కర్రలతో విచక్షణారహితంగా హృదయవిదారకరంగా దాడి చేయడం సిగ్గుచేటు. తన వృత్తిధర్మాన్ని చేయడం తప్పా... ఆంధ్రజ్యోతిపై కసి ఉంటే రాజకీయంగా, యాడ్‌లు ఇవ్వకుండా చేస్తున్నారు. ఆ సంస్థలో పొట్టకూటి కోసం పనిచేస్తున్న వ్యక్తిని దారుణంగా, భయానకంగా కొట్టడం దారుణం. జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించి కేసులు పెట్టేందుకు సంసిద్ధు కావాలి.

- వైకుంఠం ప్రభాకర్ చౌదరి, మాజీ ఎమ్మెల్యే

గూండాల్లా వ్యవహరిస్తున్నారు..



శ్రీకృష్ణపై దాడి చేయడం బాధాకరం. సిద్ధం సభలో స్వయాన సీఎం జగనే మీడియాపై ఖబడ్దార్ అంటూ గూండాలా వ్యవహరిస్తున్నారు. కనీసం పాత్రికేయులకు రక్షణ కల్పించలేని దద్దమ్మ, సైకో ప్రభుత్వం ప్రజలకు ఎలాంటి రక్షణ కల్పిస్తుంది. దోపిడీ, దౌర్జన్యం, అరాచకమే వైసీపీ పనిగా పెట్టుకుంది. ఈ విషయం ప్రజలందరికీ స్పష్టంగా అర్థమైంది. తప్పకుండా వచ్చే ఎన్నికల్లో ఇలాంటి వారిని ఇంటికి కాదు... జైలుకు పంపాలి. తలకు, వీపుపై విచక్షణారహితంగా వందల మంది వైసీపీ గూండాలు కొట్టడం దారుణమైన చర్య. ఇటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఎస్పీ, డీఎస్పీలు చర్యలు తీసుకోవాలి.

-గోనుగుంట్ల సూర్యనారాయణ, బీజేపీ సీనియర్ నాయకులు

దాడి దురదృష్టకరం




ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి దురదృష్టకరం. సీఎం జగన్ నిర్వహించిన సిద్ధం సభ నేపథ్యంలో కవరేజీ చేయడానికి వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై దాడి అంటే రాష్ట్రంలో శాంతిభద్రతలు ఏవిధంగా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు. దాడిని మేం ఖండిస్తున్నాం.

- ఆలం, కేశవరెడ్డి, ద్విసభ్యకమిటీ సభ్యులు

దుర్మార్గం: రాంభూపాల్



ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం దుర్మార్గమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ ఆదివారం విడుదల చేసిన వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. అత్యంత దారుణంగా దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. విధి నిర్వహణలో భాగంగా కవరేజీకి వెళితే వైసీపీ మూకులు దాడికి పాల్పడడం పిరికిపంద చర్య అని పేర్కొన్నారు.

ఇది ప్రజాస్వామ్యమా..?: జాఫర్



పోయేకాలం వచ్చే వైసీపీ అల్లరి మూకలు జర్నలిస్టులపై దాడులు చేస్తున్నారని, ఇది ప్రజాస్వామ్యమా..? అని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మండిపడ్డారు. నగరంలోని పావని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీకృష్ణను జాఫర్, నగర కార్యదర్శి శ్రీరాములు, రమణయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి, ఇతర నాయకులు పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సోమవారం ఎస్పీ కార్యాలయం వద్ద ధర్నా చేస్తామని పేర్కొన్నారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్



విడపనకల్లు: వైసీపీ మూకలు దాడికి తెగబడటం నీచమైన పిరికి పందుల చర్య అని ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల మండిపడ్డారు. హావళిగి గ్రామంలో బాబుష్యూరిటీ- భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే దాడి విషయం తెలుసుకుని వెంటనే శ్రీకృష్ణను ఫోన్‌లో పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైసీపీ నాయకులు రౌడీల్లా మీడియాపై దాడుల చేసి భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. ఇంత నీచంగా దాడులు చేయటం ఏమిటని ప్రశ్నించారు. వీరి ఆటలు ఇక ఎన్నాళ్లో సాగబోవన్నారు. కొన్ని రోజుల్లో వీరి ఆగడాలకు రాష్ట్ర ప్రజలు అంతం పలుకుతున్నారన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాడ్ చేశారు. రాష్ట్ర ప్రజలు వైసీపీ అల్లరిమూకల అరాచకాలను గమనిస్తున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో బుద్ధి చెబుతారన్నారు. దాడికి పాల్పడిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, ఇక మీదట ఇలాంటి ఘటనలు జరగకుండా పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

హత్యాయత్నం కేసు నమోదు చేయాలి

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి



మడకశిరటౌన్: దాడిచేసిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలని, చట్టప్రకారం కఠినంగా శిక్షించాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం రాత్రి పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో రోజు రోజుకూ వైసీపీ అరాచకాలు పెట్రేగుతున్నాయని, వృత్తి రీత్యా ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభ కవరేజీ కోసం వెళ్లిన కృష్ణపై దాడి చేయడం హేయమైన చర్య అన్నారు. పోలీసులు చూస్తుండగానే వైసీపీ రౌడీమూకలు దాడి చేసినా ప్రేక్షకపాత్ర వహించడం విచారకరం. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలకు తావులేకుండా దాడి చేసిన వారిపై కఠిన చర్యలుతీసుకోవాలని డిమాండ్ చేశారు.

దాడి అమానుషం



విధినిర్వహణలో భాగంగా ముఖ్యమంత్రి సభలో ఫొటోలు తీస్తున్న ఫొటోగ్రాఫర్‌పై దాడిచేయడం అమానుషం. ఇది పిరికిపంద చర్య. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నాం. వైసీపీ కార్యకర్తలు రౌడీల్లా దాడిచేయడం పద్ధతికాదు. జర్నలిస్టులపై దాడులను ఏమాత్రం ఉపేక్షించరాదు. దాడులకు పాల్పడ్డవారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది.

- పల్లె రఘునాథరెడ్డి, మాజీ మంత్రి

తప్పులు ఎత్తిచూపితే దాడులా..?

టీడీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు



- మాట్లాడుతున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం: వైసీపీ అరాచకాలు, తప్పిదాలను ఎత్తిచూపినందుకు శ్రీకృష్ణపై వైసీపీ అల్లరిమూకలు దాడి చేయడం అమానుషమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు అన్నారు. ఆదివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు అందరికీ ఉందన్నారు. వైసీపీని ఇంటికి పంపించే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. ప్రజలచేతిలో వైసీపీ ఓడిపోవడం ఖాయమన్నారు. ఫోటోలు తీస్తున్న సమయంలో మీ తప్పిదాలు ఎక్కడ బయటపడతాయోననే భయంతోనే ఇలా దాడులకు తెగబడటం దారుణమన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారన్నారు. దాడిచేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కొట్టడం దారుణం..



ఈ దాడి ఓ రాక్షస క్రీడ. పోయేకాలం దగ్గరపడినప్పుడే ఇలాంటి దాడులకు ఒడిగడుతారు. ఒక వ్యక్తిని అరాచకంగా, విచక్షణారహితంగా కొట్టడం దారుణం. తప్పతాగి ప్రజల మీద దాడులు చేయడం సరైన పద్ధతి కాదు. ప్రభుత్వం, పోలీసులు ఇలాంటి దాడుల పట్ల నిర్లక్ష్యం ఉండటం సరికాదు. వీరు పట్టించుకోకపోవడంతో పిచ్చి పరాకాష్టకు చేరి దాడులకు పాల్పడ్డారు. వీడియో బయటికొచ్చింది కాబట్టి సరిపోయింది. లేకపోతే జర్నలిస్టులనే పట్టుకొని లోపలేసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. దాడికి పాల్పడిన వారిని పోలీసులు పూర్తిస్థాయిలో యాక్షన్ తీసుకోవాలి. పోలీసులను ప్రజలు వైసీపీ కార్యకర్తలుగా చూస్తున్నారు. దయచేసి ఉన్న కాస్తోకూస్తో గౌరవాన్ని కాపాడుకొని దాడికి పాల్పడిన వారిపై కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో రాజకీయ పార్టీలన్ని ఏకమై పోరాటాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

పరిటాల శ్రీరామ్, టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్

దద్దమ్మల పని...



దాడి బాధాకరం. దాడి వీడియోను చూస్తుంటే ప్రతి ఒక్కరి కళ్లల్లో నీళ్లు తిరుగుతున్నాయి. ఇదే వైసీపీ చేతగానీ దద్దమ్మల పనే. దమ్ము, ధైర్యముంటే రాజకీయంగా ఎదుర్కోవాలి గానీ... ఇలా విధి నిర్వహణలో ఉన్న వారిపై దాడి చేయడం పనికిమాలిన చర్య. సిద్ధం సభలో సీఎం జగనే మీడియాను ఖబడ్దార్ అని హెచ్చరించారంటే... ఆయనే గూండాలను ప్రోత్సహించి మీడియాపై దాడి చేయాలని సూచించినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. దాడికి పాల్పడిన వారిపై రాష్ట్ర డీజీపీ, ఎస్పీ, డీస్పీలు విచారణ చేపట్టి నిందితులను రిమాండ్‌కు పంపాలి. లేదంటే అన్ని రాజకీయ, విద్యార్థి, కులసంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నాలు చేపడుతాం.

-భవానీ రవికుమార్, జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శి

జర్నలిస్టులకే రక్షణ లేదు




వైసీపీ ప్రభుత్వ హయాంలో జర్నలిస్టులకే రక్షణలేదు. ఇక సామాన్యుల పరిస్థితి ఏంటి. దాడికి పాల్పడిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. శ్రీకృష్ణకు మెరుగైన వైద్యం అందించాలి. రాజకీయాలు రాజకీయాలుగానే ఉండాలి తప్ప జర్నలిస్టులపై దాడిచేయడం ఏంటి..?

- మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, టీడీపీ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి

పిరికిపంద చర్య



దాడి పిరికిపంద చర్య. సిద్ధం సభను కవర్‌చేసేందుకు వెళ్లిన ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడికి పాల్పడటం దారుణం. విచక్షణారహితంగా దాడి చేశారు. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలి.

- బండారుశ్రావణిశ్రీ, టీడీపీ నాయకురాలు

దాడిచేసిన వారిని అరెస్టు చేయాలి

లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు

ఐజేయూ, ఏపీయూడబ్ల్యూజే, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా హెచ్చరిక

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 18: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి అనైతికమైన చర్యని ఐజేయూ జాతీయ కార్యదర్శి సోమసుందరం, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీసుబ్బారావు, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ పేర్కొన్నారు. రాప్తాడు సిద్ధం సభలో శ్రీకృష్ణపై జరిగిన దాడిని వారు ఖండిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ రౌడీ మూకలు దాడి చేయడం దుర్మార్గమన్నారు. విధి నిర్వహణలో భాగంగా జర్నలిస్టులు ఎక్కడ రాజకీయ పార్టీలు, సభలు, సమావేశాలు పెట్టినా వెళ్లి ఫోటోలు తీయడం, వార్తలు సేకరించడం రాజ్యాంగం కల్పించిన హక్కన్నారు. సీఎం జగన్ సభ ఫోటోలు తీసేందుకు వెళ్లిన శ్రీకృష్ణను వైసీపీ రౌడీలు చుట్టిముట్టి విచక్షణారహితంగా కాళ్లతో తన్నడం, పిడిగుద్దులు గుద్దడం చూస్తే చంపాలనే కుట్ర స్పష్టంగా కనిపిస్తుందన్నారు. సాక్షాత్తు సీఎం జగన్ ఒక వర్గం మీడియా అని మాట్లాడటం వల్ల ఆ పార్టీ శ్రేణులు సహనం కోల్పోయి దాడికి పాల్పడ్డారన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో జర్నలిస్టులపై దాడులు పెరిగిపోయాయన్నారు. ఈ దాడులకు సీఎం జగన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తక్షణమే దాడి చేసిన వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి వెంటనే అరెస్టులు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

దాడిని అందరూ ఖండించాలి



ఈ దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండించాలి. దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలి. సిద్ధం సభలో వైసీపీ రౌడీమూకలు పనిగట్టుకొనే ప్లాన్ ప్రకారం దాడి చేసినట్లు స్పష్టంగా అర్థమవుతోంది. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీలు చొరవ తీసుకొని దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి.

బీవీ వెంకటరాముడు, టీడీపీ రాయలసీమ మీడియా కో-ఆర్డినేటర్

అరాచకానికి నిదర్శనం

వైసీపీ అరాచకానికి నిదర్శనమే ఈ దాడి. సిద్ధం సభకు వెళ్లి అక్కడ ఫొటోలు తీస్తున్న శ్రీకృష్ణపై దాడి చేయడం దారుణం. ఫోర్త్ ఎస్టేట్‌గా పిలవబడే మీడియానుసైతం బెదిరిస్తున్నారు. ఈ ప్రభుత్వ హయాంలో అరాచకాలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయి. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. సరైన సమయంలో బుద్ధిచెబుతారు.

- అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి



గుంటనక్కల దాడి

ఇది గుంటనక్కల దాడి. వైసీపీ వికృత చేష్టలకు ఈ సంఘటన నిదర్శనం. విధినిర్వహణలో భాగంగా సభ వద్ద కవరేజీ చేస్తుండగా దాడి చేయడం అమానుషం. కాళ్లతో తన్నుతూ, పిడిగుద్దులతో దాడిచేస్తుంటే ఎంతకు బరితెగించారో అర్థమవుతోంది. జర్నలిస్టులపై దాడికి పాల్పడటం ఉన్మాద చర్య. భౌతికదాడులకు పాల్పడటం సరైన పద్ధతి కాదు.

- సవిత, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి



భయభ్రాంతులకు గురిచేస్తున్నారు



వైసీపీ అల్లరి మూకలు దాడులకు పాల్పడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. ఓటమి భయంతోనే ఈవిధంగా ప్రవర్తిస్తున్నారు. అవినీతి, అక్రమాలను వెలికితీస్తున్నారనే ఈవిధంగా దాడులకు పాల్పడుతున్నారు. వైసీపీ నాయకులు ప్రజాస్వామ్యానికి నీళ్లొదిలారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- వెంకటశివుడు యాదవ్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి

వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ



వైసీపీ పాలనలో రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యింది. సిద్ధం బహిరంగ సభను కవరేజ్ చేయడానికి వెళ్లిన స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరిమూకలు దాడిచేయడం అప్రజాస్వామికం. మీడియాపై అధికార పార్టీ అనుచరగణం దాడులకు పాల్పడటం సబబుకాదు. దాడికి పాల్పడినవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

- పెరుమాళ్ల జీవానందరెడ్డి, టీడీపీ నాయకులు

వెంటనే అరెస్టు చేయాలి



దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలి. కఠినంగా శిక్షించాలి. రాష్ట్రంలో గూండాలు, రౌడీల పాలనకు ఇదే నిదర్శనం. జర్నలిస్టులపై దాడి ప్రతికా స్వేచ్ఛపై దాడిగా పరిగణించాల్సిందే అన్నారు.

- పర్వతనేని శ్రీధర్‌బాబు, టీడీపీ అధికార ప్రతినిధి

ముక్తకంఠంతో ఖండించాలి



ఈ దాడిని వివిధ పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు ముక్తకంఠంతో ఖండించాలి. లేనిపక్షంలో ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో మరిన్ని జరిగే అవకాశం ఉంటుంది. దాడి చేసిన, ప్రోత్సహించిన వారిపై హత్యాయత్నం కేసు నమోదు చేయాలి.

- మాజీ జడ్పీటీసీ రామలింగారెడ్డి

దాడి అమానుషం



దాడి అమానుషం. దీనిని మేం తీవ్రంగా ఖండిస్తున్నాం. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అయినా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

దేగలకృష్ణమూర్తి, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి

వెంటనే చర్యలు తీసుకోవాలి



దాడిచేసిన వారిపై వెంటనే చర్యలుతీసుకోవాలి. సీఎం సభ నేపథ్యంలో కవరేజీకి వెళ్లిన వారిపై దాడి హేయమైన చర్య. వెంటనే చర్యలు తీసుకుంటే ఇలాంటి ఘటనలు పునరావృతం కావు.

- దండు శ్రీనివాసులు, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి

కేసు నమోదు చేయాలి..

శ్రీకృష్ణపై వైసీపీ గూండాలు దాడి చేయడం అమానుషం. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత జర్నలిస్టులపై దాడులు పెరిగాయి. దాడి చేసిన వారిపై హత్యాయత్నం కింద కేసు నమోదు చేయాలి. దాడులు పునరావృతం కాకుండా చూడాలి.

- టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పసుపుల హనుమంతురెడ్డి

వైసీపీ దాడి.. పిరికిపంద చర్య

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 18: వైసీపీ అవినీతి, అక్రమాలు, దౌర్జన్యాలను వెలుగులోకి తెస్తున్న ఆంధ్రజ్యోతిని ఆ పార్టీ నాయకులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎదుర్కోలేక మీడియా ప్రతినిధులపై భౌతిక దాడులకు దిగడం పిరికిపంద చర్యగా పలువురు అభివర్ణించారు. ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై జరిగిన దాడికి సీఎం జగన్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెంకటేశ్వరరెడ్డి ఈ దాడిని తీవ్రంగా ఖండించారు. అలాగే హరిజన లాయర్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప, ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ గౌడ్, వీసీకే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మందల రమేష్, ఎమ్మార్పీఎస్ అక్కులప్ప, ఏఐఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు వేమన, పీడీఎస్‌యూ శంకర్, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

ఆత్మకూరు : వైసీపీ సిద్ధం సభ కవరేజీకి వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణ పై వైసీపీ అల్లరిమూకలు దాడిచేయడం దారుణమని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. వైసీపీ బరితెగించి... ప్రజాస్వామ్యంలో ప్రజాపక్షాన నిలిచిన పాత్రికేయులపై విచక్షణారహితంగా దాడులకు పాల్పడటం శోచనీయమన్నారు. దాడికి పాల్పడ్డ వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బంగారు నగలు చోరీ

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 18: నగరంలోని జనశక్తినగర్‌లోని ఓ ఇంట్లో ఏడున్నర తులాల బంగారు నగలను శనివారం రాత్రి అపహరించారు. నగరంలోని జనశక్తినగర్‌లో షాదిక్ హుస్సేన్ కుటుంబంతో నివాసముంటున్నాడు. నగరంలో ఓ దుకాణం అద్దెకు తీసుకుని గ్యారేజ్ మెకానిక్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి మెకానిక్ షాపు వద్ద ఓ లారీ బ్రేక్‌డౌన్ అయిందని... మరమ్మతు చేయాలని ఫోన్ చేశారు. దీంతో హుస్సేన్ తన భార్య, పిల్లలను బంధువుల ఇంట్లో వదిలి వెళ్లాడు. రాత్రంతా మెకానిక్ పని చూసుకుని ఆదివారం ఉదయం ఇంటికెళ్లాడు. అప్పటికే ఇంట్లో చొరబడిన దొంగలు ఇంట్లోని వస్తువులను చిందరవందరగా పడేశారు. బీరువాలో ఉండాల్సిన ఏడున్నర తులాల బంగారు ఆభరణాలు అపహరించినట్లు నిర్ధారించుకున్నాడు. ఈ ఘటనపై ఆదివారం నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉత్సాహంగా స్కూల్ వార్షికోత్సవం



సాంస్కృతిక కార్యక్రమంలో విద్యార్థులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 18: నగరంలోని ప్రసాద్ స్కూల్ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి స్కూల్ వార్షికోత్సవం సందడిగా చేశారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం నాగరాజు, ప్రసాద్, గంగాధర్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. గతేడాది పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రత్యేకంగా సన్మానించారు. అనంతరం విద్యార్థుల ఆటపాటలతో సందడి చేశారు. విద్యార్థులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గాయత్రి, ఇన్‌చార్జులు అనూష, మల్లికార్జున, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉచితంగా తాగునీటి సరఫరా



హమాలీ కాలనీలో తాగునీరు పంపిణీ చేస్తున్న వేణుగోపాల్

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 18 : అనంతపురం అర్బన్ పరిధిలోని హమాలీకాలనీలో కొన్ని రోజులుగా తాగునీటి సరఫరా సమస్య తలెత్తింది. ఈ నేపథ్యంలో ఆదివారం టీడీపీ నాయకులు తమ్మినేని వేణుగోపాల్ ఆధ్వర్యంలో స్థానికులకు ఉచితంగా తాగునీటిని సరఫరా చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నారాయణస్వామి యాదవ్, ఆది పాల్గొన్నారు.

జిల్లా టెన్నీకాయిట్ జట్ల ఎంపిక



ఎంపికైన జిల్లా క్రీడాకారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 18: జిల్లా టెన్నీకాయిట్ సబ్‌జూనియర్ బాల, బాలికల జట్లను కళ్యాణదుర్గంలో ఆదివారం జరిగిన సెలెక్షన్స్‌లో ఎంపిక చేసినట్లు ఆ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రంగస్వామి తెలిపారు. బాలుర జట్టుకు మహీధర్, లతీఫ్, భరత్, పురుషోత్తం, బాలికల జట్టుకు... జ్యోతిక, స్పందన, పూజ, అనుష్క ఎంపికయ్యారని, వీరు రాష్ట్ర స్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

రంగనాథుడి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

గుత్తిరూరల్, ఫిబ్రవరి18: మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి వరుడై ఊరేగాడు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. తొలిరోజు జక్క లచెరువులోని స్వామివారి ఆల యంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి పెళ్లి కుమారుడి గా అలంకరించి పల్లకిలో కొలువు దీర్చారు. గ్రామోత్సవం నిర్వహించి అ నంతరం జక్కలచెరువు నుంచి తొండపాడులోని ఆలయానికి పల్లకీలో స్వామివారిని తీసుకువచ్చారు. అనంతరం రాత్రి 10 గంటలకు ధ్వజారోహణ, అంకురార్పనతో బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. స్వామి వారికి సోమవారం సింహవాహోత్సవం నిర్వహిస్తారు.

'సిద్ధం'తో ప్రయాణికుల పాట్లు



అనంతపురం బస్టాండ్‌లో కర్ణాటక బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న ప్రయాణికులు, మామిళ్లపల్లి వద్ద లారీల్లో ఎక్కుతున్న ప్రయాణికులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 18: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 857 ఆర్టీసీ బస్సుల్లో 543 బస్సులను రాప్తాడులో సీఎం జగన్‌రెడ్డి నిర్వహించిన సిద్ధం సభకు జనాలను తరలించేందుకు కేటాయించిన విషయం తెల్సిందే. దీంతో శని, ఆదివారాల్లో ఆర్టీసీ బస్టాండ్లలో బస్సులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గంటల తరబడి బస్టాండులోనే బస్సుల కోసం నిరీక్షించారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులు 90శాతం సీఎం సభకు వెళ్లిపోవడంతో అల్ట్రా డీలక్స్, ఎక్స్ ప్రెస్ బస్సులు మాత్రమే మిగిలాయి. వీటిలో సీట్లన్నీ ముందస్తుగానే రిజర్వేషన్ కావడంతో సీట్లు చిక్కక ప్రయాణికులకు నిలబడే ప్రయాణించారు. బస్సుల్లో ఫుట్‌బోర్డు సైతం ఖాళీ లేకుండా ప్రయాణికులు ఇరుక్కుని తమ గమ్యస్థానాలకు వెళ్లారు.

ధర్మవరంరూరల్: కనగానపల్లి మండలం మామిళ్లపల్లి 44వ జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఆంక్షలు విధించి జాతీయ రహదారి వాహనాలను కనగానపల్లి మీదుగా మళ్లించారు. దీంతో మామిళ్లపల్లి వద్ద నాలుగురోడ్ల సర్కిల్‌లో కంటైనర్ వాహనాలు మలుపులు తిప్పుకునేందుకు వీలుకాకపోవడంతో అలాగే నిలిచిపోయాయి. భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. గత్యంతరం లేక మహిళలు, వృద్ధులు లారీల్లో ప్రయాణించి.. వారి గమ్యస్థానాలకు చేరుకున్నారు.

అభివృద్ధిని ఆదరించి గెలిపించండి

మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 18: అభివృద్ధిని ఆదరించి.. గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. ఆదివారం అనంతపురం అర్బన్ పరిధిలోని రెండో డివిజన్‌లో మూడో రోజు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైకుంఠం ప్రభాకర్ చౌదరి మాట్లాడుతూ... మరువకొమ్మ మురికి కాలువ డిజైన్ మార్పు చేసి కమీషన్ల కక్కుర్తితో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ పాలనలో అనంతపురం అర్బన్‌లో ఎలాంటి అభివృద్ధీ జరగలేదన్నారు. రాబోవు ఎన్నిక ల్లో టీడీపీ, జనసేన బలపర్చిన అభ్యర్థిని గెలిపిస్తేనే నగరాభివృద్ధి సాధ్యమవుతుం దన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అనంత ప్రజల సమస్యలన్నీ పరిష్కరి స్తామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, నాయకులు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళీ, రాజీవ్‌రెడ్డి, డిస్కో బాబు, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, నటేష్ చౌదరి, నారాయణస్వామి యాదవ్, రాజారావు, సుధాకర్ యాదవ్, మారుతీకుమార్ గౌడ్, గుర్రం నాగభూషణం, బంగి నాగ,పోతుల లక్ష్మీనరసింహులు, సుధాకర్ నాయుడు, మార్కెట్ మహేష్, కురుబ నారాయణస్వామి, ముక్తియార్, కడియాల కొండన్న, తెలుగు మహిళలు స్వప్న, విజయశ్రీరెడ్డి, సంగా తేజస్విని, కృష్ణవేణి, సరళ, జానకి, సుజాత, వసుంధర, హసీనా, మణెమ్మ పాల్గొన్నారు.



ప్రజలతో మాట్లాడుతున్న ప్రభాకర్ చౌదరి

భక్తిశ్రద్ధలతో మధ్వనవమి

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 18: స్థానిక మొదటి రోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో ఆదివారం మధ్వనవమి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రాఘవేంద్రస్వామి బృందావనానికి ఫలపంచామృతాభిషేకాలు చేయడంతో పాటు స్వామివారి ఉత్సవమూర్తితో ఆలయ ప్రాకారోత్సవం చేశారు. అనంతరం పురవీధుల్లో రథోత్సవం నిర్వహించారు. మహామంగళహారతి నివేదన అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో మఠం మేనేజర్ బద్రీనాథ్, భక్తులు పాల్గొన్నారు.



అలంకరణలో బృందావనం, రథోత్సవంలో ఆలయ కార్యవర్గం

వైభవంగా రుక్మిణీ కల్యాణం

అనంతపురం కల్చరల్: స్థానిక గీతామందిర్‌లో రుక్మిణీ కల్యాణాన్ని ఆదివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివాహం కాని యువతీ యువకుల కోసం సాయి ట్రస్టు ఆధ్వర్యంలో దీన్ని చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన జీయర్‌స్వామి శిష్యవర్గం మాధవాచార్యులు బృందం నేతృత్వంలో తొలుత గోపూజ నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణంలో రుక్మిణీ సమేత పాండు రంగ కల్యాణాన్ని శాస్త్రబద్ధంగా నిర్వహిం చారు. సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసా యికుమార్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో మనూరు నాగరాజరావు, నాట్యాచార్యురాలు సంధ్యామూర్తి, సాయి ట్రస్టు సభ్యులు నారాయణ, రాఘవేంద్ర పాల్గొన్నారు.



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం



సమ్మేళనంలో పాల్గొన్న అలనాటి విద్యార్థులు, ఉపాధ్యాయులు

పూర్వ విద్యార్థుల సమావేశం

రామగిరి, ఫిబ్రవరి 18: మండలంలోని కుంటిమద్ది ఉన్నత పాఠశాలలో 2003-04 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. అలనాటి గురువులను ఘనంగా సన్మానించారు. ఆ వి ద్యార్థులు సాయంత్రం వరకు పాఠశా లలోనే పాత జ్ఞాపకాలను గుర్తు చేసు కొంటూ ఆనందంగా గడిపారు.

టీడీపీ ఆత్మీయ సమావేశం

శింగనమల, ఫిబ్రవరి 18: స్థానిక రామస్వామి దేవాలయంలో టీడీపీ గ్రామకమిటీ అధ్యక్షుడు బండి వెంకటనారాయణ ఆధ్వర్యంలో గ్రామ టీడీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో శింగనమల పంచాయతీలో టీడీపీకి అధిక మెజార్టీతో గెలిపించడమే లక్ష్యంగా పని చేయాలన్నారు. శింగనమల నియోజకవర్గంలో చంద్రబాబునాయుడు పార్టీ బీ ఫారం ఎవరికి ఇస్తే వారి గెలుపు కోసం కలసి గట్టిగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చాకలి వెంకటేశ్, బోయసత్తి, ఆదినారాయణ, రాజశేఖర్‌యాదవ్, అక్బర్, శంకర, సురేష్, జాడేజా, రాముడు, నాగరాజు, ఆంజి, ఈడిగ శంకర్, మునీంద్ర, వెంకటేశ్, సత్తి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న టీడీపీ కార్యకర్తలు, నాయకులు

జగన్.. 2.13 లక్షల ఉద్యోగాలు ఎక్కడిచ్చావ్...?

టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం



అనంతపురం విద్య, ఫిబ్రవరి 18: ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్, 2.13 లక్షల ఉద్యోగాలిస్తామని అధికారంలోకి వచ్చిన జగన్.. ఆ ఉద్యోగాలు ఎక్కడిచ్చాడో చెప్పాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండి పరశురాం ప్రశ్నించారు. ఆదివారం ఆ సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... చదువుతున్న ప్రతి విద్యార్థికి అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతి దీవెన ఇస్తామని, కార్పొరేట్ విద్య, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, మద్యపాన నిషేధం, డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ చేస్తానని చెప్పిన జగన్‌రెడ్డి.. ఇప్పుడు ఆ మాట తప్పాడని అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఓటు అడిగే హక్కులేదని జగన్‌పై మండిపడ్డారు. ఏ హామీ నెరవేర్చని జగన్.. మరోసారి రాష్ట్ర ప్రజలను మోసం చేయడానికా లేక మరి దేనికి సిద్ధంగా ఉన్నాడో చెప్పాలంటూ ప్రశ్నించారు. సిద్ధం సభకు జనాలు రాక ఇతర జిల్లాల నుంచి తీసుకొచ్చే దుస్థితికి వైసీపీకి వచ్చిందన్నారు. ఎన్ని కుయుక్తులు పన్నినా... వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం వస్తుందని, నారా చంద్రబాబునాయుడు మరోసారి సీఎం అవుతారని, నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలకు పెద్ద పీట వేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

ప్రజాస్వామ్య పరిరక్షణ కమిటీ ఎన్నిక



అల్తాఫ్, సాంబశివుడు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 18: ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా నూతన కమిటీని ఆదివారం ఆర్ట్స్ కళాశాలలో ఎంపిక చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అల్తాఫ్ అధ్యక్షతన నిర్వహించిన ఐక్యవేదిక రెండో మహాసభలో ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. జిల్లా అధ్యక్షుడిగా అల్తాఫ్, ప్రధాన కార్యదర్శిగా సాంబశివుడు, కోశాధికారి టీవిరెడ్డితో పాటు మరో 16 మంది జిల్లా కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, రాష్ట్రసమన్వయ కమిటీ నాయకుడు, జనవిజ్ఞాన వేదిక జాతీయ నాయకుడు బ్రహ్మారెడ్డి, జిల్లా కోర్ కమిటీ నాయకుడు శంకర్‌గౌడ్, జైభారత్ సంస్థ నాయకుడు కుల్లాయప్ప, మానవతా రక్తదాతల సంస్థ కన్వీనర్ అమర్నాథ్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్, జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వరయ్య, నగర గౌరవాధ్యక్షుడు షేక్ నబీరసూల్ హాజరయ్యారు.

ఆసక్తిగా సాగిన ఏపీఎల్ పోటీలు



రామ్‌కు అవార్డు అందజేస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 18: ఏపీఎల్ 9వ రౌండ్ క్రికెట్ పోటీలు ఆసక్తిగా సాగాయి. జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో సీనియర్ ఏపీఎల్ 9వ రౌండ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఇందులో హిందూపురంపై తాడిపత్రి, బత్తలపల్లిపై గుంతకల్లు జట్లు విజయం సాధించాయి. 30 పరుగులు చేసి, 2వికెట్లు తీసి తాడిపత్రి జట్టు గెలుపులో కీలకంగా వ్యవహరించిన రామ్‌కు మ్యాన్‌ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి, కోచ్‌లు నరేష్, కుమార్, ప్రవీణ్, బొమ్మన్న, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఆదాయం కోసం ఇసుక తవ్వకాలు పెంచారా?

ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ప్రశ్నించిన మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్

తాడిపత్రి, ఫిబ్రవరి 18: ఎన్నికలు వస్తున్నాయని, ఆదాయం కోసం ఇసుక అక్రమ తవ్వకాలను పెంచారా అని ఎమ్మెల్యే పెద్దారెడ్డిని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దపప్పూరు మండలంలో పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. పెన్నానది పరివాహక ప్రాంతం అంతా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోయి రైతాంగం దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. పండ్లతోటల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిరసిస్తూ పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడి స్తామని హెచ్చరించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు పంపినా పట్టించుకోలేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తానే రంగంలోకి దిగి ఇసుక తరలించే టిప్పర్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలను అడ్డుకుంటానని తెలిపారు. రాయలసీమలో ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లేవన్నారు. చాగల్లు డ్యాంలో అరకొరగా ఉన్న నీటిని అశ్వత్థం తిరునాల పేరుతో విడుదల చేశారన్నారు. ఈ నీటిని రైతుల అవసరాలకు ఉపయోగించాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం అశ్వత్థం సమీపంలో పదిబోర్లు వేసి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

కిలోమీటర్ల మేర స్తంభించిన ట్రాఫిక్

వాహనదారులకు నరకం... గంటల తరబడి నిరీక్షణ

రాప్తాడు, ఫిబ్రవరి 18: వైసీపీ సిద్ధం సభ వాహనదారులకు నరకం చూపించింది. కిలోమీటర్ల మేర జాతీయ రహదారిలో ట్రాఫిక్ స్తంభించింది. ఫలితంగా జాతీయరహదారిలో ప్రయాణించే ప్రయాణికులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. అనంతపురం, కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాల నుంచి వైసీపీ కార్యకర్తలను భారీగా తరలించారు. సభ స్థలానికి దగ్గర్లో వాహనాలు పార్కింగ్ చేయడం, సిద్ధం సభ సమావేశం ముగిసిన తరువాత ఒక్క సారిగా వాహనాలు తమ ప్రాంతాలకు వెళ్లేందుకు బయలుదేరడంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించింది. రాప్తాడు నుంచి అనంతపురం వైపు నగర శివార్ల వరకూ ఒక వైపు, రాప్తాడు నుంచి రామినేపల్లి వరకూ జాతీయ రహదారిలో వేల సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. రాత్రి 12 గంటలు గడిచినా వాహనాలు కదల్లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు.

పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి18: పాలిసెట్-2024కి పదో తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గుంతకల్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అష్రఫ్ అలీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు, పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థు లు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 20 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకోవడా నికి ఏప్రిల్ 5వరకు గడువుందన్నారు. ఏప్రిల్ 27న పాలిసెట్ పరీక్ష ఉంటుందన్నారు.

కోటంకలో వైభవంగా తిరునాళ్ల

గార్లదిన్నె, ఫిబ్రవరి 18: మండలంలోని కోటంక గ్రామ సమీపంలోని శ్రీ గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. రెండో ఆదివారం సందర్భంగా అర్చకులు స్వామివారిని తెల్లవారుజామున వివిధ పుష్పలతో ప్రత్యేకంగా ఆలంకరణ చేసి, ఏకవార రుద్రభిషేకం నిర్వహించారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హజరయ్యారు. మొక్కులు నెరవేరిన భక్తులు వివిధ రూపాల్లో కానుకలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

అన్నదానం: భక్తులకు వై.వెంకటరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు వై.కొండారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వై.నారాయణరెడ్డి (అనంతపురం మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్) ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, తాగునీటి సదుపాయం కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, తాతిరెడ్డి, యల్లారెడ్డి పాల్గొన్నారు.



స్వామిని దర్శించుకునేందుకు బారులు తీరిన భక్తులు, అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

మత్తు పదార్థాల నిర్మూలనపై
అవగాహన ర్యాలీ

అనంతపురం రూరల్, ఫిబ్రవరి 18: 'మత్తు పదార్థాలు నిర్మూలిద్దాం. ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం..' అని నినదిస్తూ జమా అతే ఇస్లామీ హింద్ అనంతపురం శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రుద్రంపేట చంద్రబాబు కొట్టాలులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. జమాత్ అనంతపురం శాఖ అధ్యక్షుడు నవాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. ఈ నెల 8 నుంచి 18 వరకు చేపట్టిన ఉద్యమం ముగింపు సందర్భంగా ఈ ర్యాలీ చేపట్టామన్నారు. విద్యాసంస్థలు, పలు జనాభా రద్దీ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేపట్టామన్నారు. మత్తుపదార్థాల వలన కలిగే అనార్థాలపై అవగాహన కల్పించామన్నారు. ఈ ర్యాలీలో నాయకులు హాజీపీరా, ఏజాజ్, అహ్మద్, జీలాన్ పాల్గొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.16 లక్షలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 18: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువులసంతతో మార్కెట్‌కు రూ.3,16,000 ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.1,80, 300, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,35,700 ఆదాయం వచ్చిందని తెలిపారు.

నేత్రపర్వంగా ధ్వజారోహణం

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 18: కొండమీదరాయుడి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం ప్రక్రియ నేత్రపర్వంగా సాగింది. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు ఆదివారం శ్రీ వారి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ముందు ఉన్న ధ్వజస్తంబానికి కర్పూర హారతుల ఇచ్చి ఆరోహణం చేశారు. అనంతరం స్వామి వారి ఉత్సవ మూర్తులను దేవరకొండపై నుంచి పల్లకీ సేవలో స్వామి వారిని పురవీదుల్లో ఊరేగిస్తూ... స్థానిక లక్ష్మీనారాయణస్వామి దేవాలయం వద్దకు తీసుకొచ్చారు.

పూలపల్లకీలో ఊరేగిన శ్రీవారు..: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పూలపల్లకీలో స్వామీ అమ్మవార్లను పురవీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను వివిధరకాల పూలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం సింహవాహనం సేవ నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు ఈ సందర్భంగా తెలిపారు.



హోమం నిర్వహిస్తున్న వేదపండితులు, పూలపల్లకీలో విహరిస్తున్న కొండమీదరాయుడు

వరుడై ఊరేగిన రంగనాథుడు

స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



అలంకరణలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులు

గుత్తిరూరల్, ఫిబ్రవరి18: మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథ స్వామి వరుడై ఊరేగాడు. స్వామి వారి బ్రహ్మోత్సవాలు ఆదివారం రాత్రి వైభవంగా ప్రారంభమయ్యాయి. తొమ్మిది రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. తొలిరోజు జక్కలచెరువులోని స్వామివారి ఆలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి పెళ్లి కుమారుడిగా అలంకరించి పల్లకిలో కొలువు దీర్చారు. గ్రామోత్సవం నిర్వహించి అనంతరం జక్కలచెరువు నుంచి తొండపాడులోని ఆలయానికి పల్లకీలో స్వామివారిని తీసుకువచ్చారు. అనంతరం రాత్రి 10 గంటలకు ధ్వజారోహణ, అంకురార్పనతో బ్రహ్మోత్సవాలు మొదలయ్యాయి. స్వామి వారికి సోమవారం సింహవాహోత్సవం నిర్వహిస్తామని ఈఓ దేవదాసు తెలిపారు.

ఆదాయం కోసం ఇసుక తవ్వకాలు పెంచారా?

ఎమ్మెల్యే పెద్దారెడ్డిని ప్రశ్నించిన మున్సిపల్ చైర్మన్ జేసీపీఆర్



విలేకరులతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, ఫిబ్రవరి 18: ఎన్నికలు వస్తున్నాయని, ఆదాయం కోసం ఇసుక అక్రమ తవ్వకాలను పెంచారా అని ఎమ్మెల్యే పెద్దారెడ్డిని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు. స్థానిక నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పెద్దపప్పూరు మండలంలో పెద్దఎత్తున ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. పెన్నానది పరివాహక ప్రాంతం అంతా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయన్నారు. దీంతో భూగర్భజలాలు అడుగంటిపోయి రైతాంగం దారుణ పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. పండ్లతోటల ఉనికి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇసుక అక్రమ తవ్వకాలను నిరసిస్తూ పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులకు పలుమార్లు వినతిపత్రాలు పంపినా పట్టించుకోలేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తానే రంగంలోకి దిగి ఇసుక తరలించే టిప్పర్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలను అడ్డుకుంటానని తెలిపారు. రాయలసీమలో ఇసుక తవ్వకాలకు పర్యావరణ అనుమతులు లేవన్నారు. చాగల్లు డ్యాంలో అరకొరగా ఉన్న నీటిని అశ్వత్థం తిరునాల పేరుతో విడుదల చేశారన్నారు. ఈ నీటిని రైతుల అవసరాలకు ఉపయోగించాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం అశ్వత్థం సమీపంలో పదిబోర్లు వేసి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు.

వైసీపీని భూస్థాపితం చేద్దాం: ఉమా



ర్యాలీగా వస్తున్న ఉమామహేశ్వరనాయుడు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 18: ప్రజా మద్దతుతో వైసీపీని భూస్థాపితం చేద్దామని టీడీపీ నియోజక వర్గ ఇన్‌చార్జ్ ఉమామహేశ్వర నాయుడు అన్నారు. ఆదివారం మున్సిపాల్టీ పరిధిలోని దొడగట్ట గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఆయన ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజావేదికలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అవినీతి, అక్రమాలు తారస్థాయికి చేరాయన్నారు. పల్లె నుంచి పట్టణాల వరకు అభివృద్ధి బాటలో నడవాలన్నా, భావితరాల భవిష్యత్తు బాగుపడాలన్నా చంద్రబాబునాయుడుతోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ దొడగట్ట నారాయణ, జిల్లా కార్యదర్శి తలారి సత్తి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



టీడీపీలోకి చేరిన వైసీపీ మైనార్టీ నాయకులు

ఉరవకొండ, ఫిబ్రవరి18: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకి చెందిన వైసీపీ మైనార్టీ నాయకులు టీడీపీలోకి చేరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు పయ్యావుల శ్రీనివాసులు సమక్షంలో, వైసీపీకి చెందిన సాదిక్, గౌస్‌మొహిద్దీన్, మాబు, అల్లాబకాష్ టీడీపీలో చేరారు. పెద్దముష్టూరుకు చెందిన వైసీపీ నాయకులు సిద్ధయ్య, ఎర్రిస్వామి టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రామాంజినేయులు,తిమ్మప్ప, ప్యారంకేశవానంద, రహంతుల్లా, ఖలందర్, సలాం, ఖాదర్, పెద్దముష్టూరు నాగరాజు పాల్గొన్నారు.

పట్టణంలో పర్యటించిన జేసీ అశ్మిత్‌రెడ్డి



మహిళతో మాట్లాడుతున్న అశ్మిత్‌రెడ్డి

తాడిపత్రి, ఫిబ్రవరి18: పట్టణంలోని నందలపాడు, ఆంజనేయస్వామి మాన్యంలో ఆదివారం టీడీపీ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. ఆయన వెంట నందలపాడు కౌన్సిలర్ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రేపు సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ

పుట్లూరు, ఫిబ్రవరి18: మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో ఈనెల 20న సీతారామలక్ష్మణ హనుమ సమేత శిఖర కలశ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు ఆదివారం తెలిపారు. 20న గణపతి పూజ, గ్రామోత్సవం, 21న శిఖర కలశ ప్రతిష్ఠ, సీతారామలక్ష్మణ హనుమ విగ్రహ పునః ప్రతిష్ఠ కార్యక్రమం ఉంటుందన్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు.

బ్రహ్మసముద్రంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్



ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెలుగు యువత అధ్యక్షుడు నీలాస్వామి

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 18: మండలకేంద్రంలోని బూత్ నెంబర్ 26, 27, 29లో కొత్తగా నమోదైన ఓటర్లకు మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ అనే కార్యక్రమం గురించి కళ్యాణదుర్గం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు నీలాస్వామి వివరించారు. కొత్తగా ఓటరుగా నమోదు చేసుకున్న వారి ఇంటి దగ్గరకు వెళ్లి టీడీపీకి ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రాయుడు, తెలుగు యువత నాయకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రయాణికుల పాట్లు

సిద్ధం సభకు తరలిన ఆర్టీసీ బస్సులు

ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఇబ్బందిపడ్డ ప్రజలు

గుంతకల్లుటౌన్/ గుత్తి/ యల్లనూరు/కణేకల్లు, ఫిబ్రవరి 18: రాప్తాడులో జరుగుతున్న వైసీపీ సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను తరలించడంతో ప్రయాణికులు ఆదివారం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంతకల్లు డిపో నుంచి 35 బస్సులు సిద్ధం సభకు తరలించారు. ఉదయం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు గంటల కొద్ది వేచి చూశారు. అనంతపురం రూట్‌లో రెండు, ఆదోనికి2, బళ్లారికి రెండు, కర్నూలు కి రెండు బస్సులను నడిపారు. ఉరవకొండ నుంచి గుంతకల్లుకు మూడు బస్సులను నడిపారు. గుత్తిలో కూడా అనంతపురం, కర్నూ లు, తాడిపత్రి, పత్తికొండ వైపు వెళ్లే బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పని నిమిత్తం యల్లనూరు వచ్చి తాడిపత్రి... సింహాద్రిపురం వైపు వెళ్లే ప్రయాణికులు ఆదివారం అష్టకష్టాలు పడ్డారు. కణేకల్లు నుండి ఉరవకొండ, కళ్యాణ దుర్గం, రాయదుర్గం, బళ్లారి తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణీకులు నానా ఇబ్బందులు పడ్డారు. పెళ్లి ముహూర్తాలు కూడా ఉండగా జగన్ ప్రభుత్వం బస్సులు మొత్తం కార్యకర్తలకు కేటాయించి సిద్ధం సభకు తరలించేందుకు చర్యలు తీసుకోవడంతో సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతూ వైఎస్సార్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

యాడికి: రాప్తాడులో నిర్వహించిన సిద్ధం సభకు ఆర్టీసీ బస్సులను తరలించడంతో బస్సుల్లో ప్రయా ణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యాడికి నుంచి గుత్తి, తాడిపత్రి ప్రాంతాలకు ప్రతి రోజూ వందల మంది ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్ర యాణిస్తుంటారు. శనివారం మధ్యాహ్నం నుంచే ఆర్టీసీ బస్సులను సిద్ధం సభ కోసం వివిధ గ్రామాల నుంచి వైసీపీ నాయకులను, కార్యకర్తలను తరలించడం కోసం వివిధ గ్రామాలకు పంపారు. దీంతో ప్రయాణికులు బస్సుల కోసం గంటలపాటు వేచిచూస్తూ తీవ్ర ఇబ్బందులు పడ్డారు.



సిద్ధం సభకు వెళ్లడానికి యాడికిలో ఏర్పాటు చేసిన ప్రైవేట్ స్కూల్ బస్సులు

ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాల బాధలు

సిద్ధం సభ కోసం ప్రైవేట్ స్కూల్ బస్సులను పంపాల్సిందేనని అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో శనివారం మధ్యాహ్నం నుంచే ప్రైవేట్ స్కూల్ బస్సులను పంపించారు. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది లు ఎదుర్కొన్నారు. సభలకు బస్సులను పంపకపోతే ఎంవీఐల నుంచి ఇబ్బందులు తలెత్తుతాయోనని భయపడి బస్సులను పంపుతున్నట్లు ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్‌లు వాపోతున్నారు. గతనెలలో కూడా సీఎం సభల కోసం ప్రైవేట్ పాఠశాలలకు రెండు రోజులు సెలవు ప్రకటించినట్లు వారు తెలిపారు. పాఠశాలల పని వేళల్లో స్కూల్‌బస్సులను పంపిస్తుండటం తో విద్యార్థుల తల్లిదండ్రులు మమ్మల్ని నిలదీస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులకు సమాధానం చెప్పలేని పరిస్థితుల్లో ఉన్నామని పలువురు ప్రైవేట్ స్కూల్స్ కరస్పాండెంట్‌లు తెలిపారు.



గుంతకల్లు బస్టాండ్‌లో వేచివున్న ప్రయాణికులు

వైసీపీకి పేదలే గుణపాఠం చెప్పాలి: కేశవ్

విడపనకల్లు, ఫిబ్రవరి 18: పేదలను నిలువునా మోసం చేసిన వైసీపీ ప్రభుత్వానికి వారే తగిన గుణపాఠం చెప్పాలని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పిలుపునిచ్చారు. మండలంలోని హావళిగి గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. సాయంత్రం హావళిగి గ్రామం చేరుకోగానే గ్రామ టీడీపీ నాయకులు కేశవ్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఇంటింటికి ప్రచారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు అందించే అనేక పథకాలను రద్దు చేసిందన్నారు. దోచుకోవటం దాచుకోవటమే వీరికి అభివృద్ధి అన్నారు. రాబోయే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాలన్నారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బీడీ చిన్న మారయ్య, నాయకులు దేవేంద్ర, తిమ్మప్ప, గణేష్, మారెప్ప, నాగేశ్వర్‌రావు, మెక్కినేని రాజేష్, కుమార్ స్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.



మహిళలకు కరపత్రాలు అందిస్తున్న కేశవ్

రాయలసీమ ద్రోహి జగన్: టీడీపీ



మాట్లాడుతున్న వెంకటశివుడు యాదవ్

గుత్తి, ఫిబ్రవరి18: రాయలసీమ ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేసిన నమ్మక ద్రోహి వైఎస్ జగన్ అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆయన నివాసంలో ఆదివారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహిం చారు. ఆయన మాట్లాడుతూ రాప్తాడుకు సిద్ధం సభ పేరుతో ప్రజలను మరోసారి మభ్యపెట్టేందుకు వచ్చారన్నారు. ఆయన మాటలు ప్రజలు ఎవరూ నమ్మే పరిస్థితి లేదన్నారు. రైతులు, ప్రజలు, తాగు, సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎక్కడా ప్రాజెక్టుల నిర్మాణం జరగలేదన్నారు. రాయలసీమ ద్రోహి జగన్‌రెడ్డికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు నరేంద్రచౌదరి, మాజీ సర్పంచు సుంకన్న, తెలుగుయువత నాయకులు సుధాకర్‌నాయుడు, రంగారెడ్డి, వెంకటశివుడు, రమణ, మహేశ్వరరెడ్డి, డాక్టర్ శంకర్‌మహాదేవ్, రాము, కదిరప్ప, కొండారెడ్డి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 18: శెట్టూరు మండలంలోని చెర్లోపల్లి ఉన్నత పాఠశాలలో 2000-2001 సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశులు, ఆదినారాయణ, నాగేంద్ర, సతీష్, హర్షవర్ధన్, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



కలిసిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోండి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి18: పాలిసెట్-2024కి పదో తరగతి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గుంతకల్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అష్రఫ్ అలీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థులు, పది పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈనెల 20 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5వరకు గడువుందన్నారు. ఏప్రిల్ 27న పాలిసెట్ పరీక్ష ఉంటుందన్నారు.

టీడీపీ యాప్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయం

గుంతకల్లుటౌన్,ఫిబ్రవరి18: నియోజకవర్గం తరపున టీడీపీ యాప్‌ను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ అన్నారు. టీడీపీ యాప్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విశేష కృషి చేసిన టీడీపీ కుటుంబ సభ్యులు సుంకప్ప, సుధాకర్, పురుషోత్తం, బండారురామ్మోహన్, పునీత్‌లకు తన క్యాంపు కార్యాలయంలో పార్టీజెండా, సైకిల్ గుర్తును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఏపీయూడబ్ల్యూజే కమిటీ ఏర్పాటు

ఉరవకొండ, ఫిబ్రవరి18: ఏపీయూడబ్ల్యూజే నియోజకవర్గ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. పట్టణంలోని యాదవ కల్యాణ మండపంలో జర్నలిస్టుల సమావేశం నిర్వహించారు. నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆనంద్, గౌరవాధ్యక్షుడిగా బాలచంద్ర, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, ఉపాధ్యక్షుడిగా అబ్దుల్‌గఫూర్, సహాయకార్యదర్శిగా రాంబాబు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా నరసింహనాయక్, కోశాధికారిగా అమరేష్‌తోపాటు మరో ఐదుగురిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

యువతతో సమాజంలో మార్పు

తాడిపత్రి, ఫిబ్రవరి18: యువత దేశానికి వెన్నెముక అని, వారు క్రియాశీల రాజకీయాల్లో పాల్గొనాలని జనసేవ సొసైటీ, ధర్మా హ్యూమన్ రైట్స్ సంస్థ జాతీయ అధ్యక్షుడు ఆదిశేషు తెలిపారు. పట్టణంలో ఆదివారం యువత తీర్పు, సమాజ మార్పు అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో యువత ముందుకు వచ్చి తమ పాలకులను ఎన్నుకోవాలన్నారు. తాడిపత్రి పారిశ్రామిక అభివృద్ధి చెందుతున్నా యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేవన్నారు. యువతకు ప్రాధాన్యత కల్పించే వారికే తాము మద్దతు ఇస్తామని తెలిపారు.

ఈశ్వరుడి ఉత్సవాలు ప్రారంభం

రాయదుర్గం, ఫిబ్రవరి 18: మండలంలోని కెంచానపల్లి గ్రామంలో వెలసిన ఈశ్వరుడి దేవాలయంలో ఆదివారం ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి గంగపూజ, గోపూజ తదితర పూజలు నిర్వహిస్తారు. సోమవారం ఉదయం నుండి గణపతి స్థాపన, రుద్రహోమం, పూర్ణాహుతి నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామంలో రెండురోజుల పాటు ఈశ్వరుని దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రిజర్వాయరులో నీటి నిల్వ 0.437 టీఎంసీలు

బెళుగుప్ప, ఫిబ్రవరి 18: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ఆదివారం నీటి నిల్వ 0.437 టీఎంసీలు వున్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఇన్‌ఫ్లో 704 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 600 క్యూసెక్కులు ఉన్నట్లు తెలిపారు.

కోటంకలో వైభవంగా ఉత్సవాలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

గార్లదిన్నె, ఫిబ్రవరి 18: మండలంలోని కోటంక గ్రామ సమీపంలోని శ్రీ గుంటి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. రెండో ఆదివారం సందర్భంగా అర్చకులు స్వామివారిని తెల్లవారుజామున వివిధ పుష్పల తో ప్రత్యేకంగా ఆలంకరణ చేసి, ఏకవార రుద్రభిషేకం నిర్వహించారు. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. మొక్కులు నెరవేరిన భక్తులు వివిధ రూపాల్లో కానుకలు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది.

అన్నదానం: భక్తులకు వై.వెంకటరెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు వై.కొండారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వై.నారాయణరెడ్డి (అనంతపురం మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్) ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం, తాగునీటి సదుపాయం కల్పించారు. మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ నారాయణరెడ్డి, సుబ్బిరెడ్డి, తాతిరెడ్డి, యల్లారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి స్పందన



వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

యాడికి, ఫిబ్రవరి18: మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్, శాంతిరాం హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం యాడికిలో నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. యాడికిలోని వివేకానంద హైస్కూల్‌లో నిర్వహించిన ఉచిత శిబిరానికి 108మంది రోగులు వచ్చి కంటిపరీక్షలు చేయించుకున్నారన్నారు. వీరిలో 50మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మే ఐ హెల్ప్‌యూ ఫౌండేషన్ సభ్యులు బాలకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

జొన్న చిగురు తిని 62 గొర్రెలు మృతి

విడపనకల్లు, ఫిబ్రవరి 18: మండలంలోని పెద్ద కొట్టాలపల్లి-కరకముక్కల గ్రామాల మధ్య ఆదివారం పంట పొలాల్లోని జొన్న చిగురును తిని 62 గొర్రెలు మృతి చెందాయి. పశు వైద్యాధికారి నరేష్ కుమార్ తెలిపిన మేరకు కూడేరు మండలం ఉదిరిపికొండ తండాకు చెందిన కొంతమంది కాపరులు గొర్రెలను మేపుతూ పెద్ద కొట్టాలపల్లి పొలాలకు చేరుకున్నారు. పెద్ద కొట్టాలపల్లి-కరకముక్కల గ్రామాల వద్ద జొన్న పంటను కోతలు కోసి రైతులు వదిలేశారు. ఆ జొన్న చిగురించి మొలకెత్తింది. మొలకెత్తిన జొన్న చిగురును దాదాపుగా వందకు పైగా గొర్రెలు తిన్నాయి. వాటిలో 62 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా మిగిలిన గొర్రెలను చికిత్సలు నిర్వహించి ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడినట్లు తెలిపారు. ఉదిరిపికొండతండాకు చెందిన చిన్న నారాయణ నాయక్‌కు చెందిన 32 గొర్రెలు, ఆర్ కుళ్లాయప్ప నాయక్‌కు చెందిన 30 గొర్రెలు మృతి చెందాయని వాటి విలువ దాదాపుగా రూ. 7.5లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.



గొర్రెల కళేబరాలు

మహాలక్ష్మి ఆలయంలో కాలవ ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న కాలవ దంపతులు

డీ.హీరేహాళ్, ఫిబ్రవరి 18: మండలంలో ప్రసిద్ధిగాంచిన ఓబుళాపురం మహాలక్ష్మి ఆలయంలో మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు సతీసమేతంగా ఆదివా రం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆలయంలో ఏర్పాటు చేసిన హోమంలో కాలవ శ్రీనివాసులు దంపతులు పాల్గొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి కుంకుమార్చన, బిల్వార్చన, సహస్రనామార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా ఆలయంలో ఏర్పాటు చేసిన గోపూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాలలో మండల కన్వీనర్ హనుమంత రెడ్డి ఇతర టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రాక్షస పాలనను సాగనంపండి: పీజేఆర్



మాట్లాడుతున్న జీవానంద రెడ్డి

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 18: రాష్ట్రంలో జగన్ రాక్షస పాలనను సాగనంపాలని టీడీపీ సీనియర్ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి పిలుపునిచ్చారు. పట్టణంలోని జీవానంద రెడ్డి స్వగృహం వద్ద ఆదివారం మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత తమ భవిష్యత్తు కోసం మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. కియా ఆటోమొబైల్స్, హైటెక్ సిటీ, వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ లాంటి పరిశ్రమలను తెచ్చి ఈ రోజు వేల కుటుంబాలకు ఆసరాగా నిలిచిన ఘనత చంద్రబాబుది అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడి పిరికిపంద చర్య



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

యాడికి, ఫిబ్రవరి18: ఏబీఎన్-ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి పిరికి పందల చర్య అని మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్‌లు తెలిపారు. ఆదివారం రాత్రి రాయలచెరువులో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని వారు ఖండించారు. ప్రభుత్వ వైఫల్యాలను వెలికి తీస్తున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సిబ్బందిపై దాడి చేయడం తగదన్నారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించలేకపోవడం ప్రభుత్వ చేతగానితనమని వారు తెలిపారు. సమావేశంలో టీడీపీ మాజీ మండల కన్వీనర్ మాదాల అనిల్, వాణిజ్య సెల్ కార్యదర్శి రజక శేఖర్, గోపాల్, నరేంద్రబాబు, జాఫర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాఘమాస పూజలు



అలంకరణలో అశ్వత్థ నారాయణస్వామి, భీమలింగేశ్వరస్వామి

పెద్దపప్పూరు, ఫిబ్రవరి18: మండలంలోని చిన్నపప్పూరు గ్రామ సమీపంలో వెలసిన అశ్వత్థనారాయణస్వామి, శ్రీ చక్రస్థాపిత భీమలింగేశ్వర స్వామి ఆలయంలో మాఘమాసం పురస్కరించుకొని రెండవ ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. ఈ సందర్భంగా అశ్వత్థ నారాయణునికి, భీమలింగేశ్వరునికి విశేష అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు.

21నుంచి ప్రజాపోరు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి18: బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 21నుంచి ప్రజాపోరు కార్యక్రమాన్ని 9రోజులపాటు నిర్వహించనున్నట్లు నియోజకవర్గ కన్వీనర్ రంగనాథరెడ్డి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ వైసీపీ అవినీతి, అసమర్థ ప్రభుత్వాన్ని కూల్చడానికి బీజేపీ ప్రజా పోరు కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించిందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామని తెలిపారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు శింగిరి లక్ష్మినారాయణ, నాయకులు రామాంజనేయులు, గంగాధర్‌యాదవ్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నాయకుల అరెస్ట్

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి18: రాప్తాడులో సీఎం జగన్ వైసీపీ సిద్ధం కార్యక్రమం నేపథ్యంలో పట్టణంలోని సీపీఐ నాయకులను పోలీసులు ఆదివారం ముందస్తు అరెస్ట్ చేసి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు మాట్లాడుతూ ప్రజల పక్షాన పోరాడే వామపక్ష నాయకులను రెండు రోజుల నుంచి నోటీసులు ఇచ్చి అరెస్టు చేయడం సిగ్గుచేటన్నారు. ఏ ముఖం పెట్టుకుని జిల్లా పర్యటిస్తున్నావని ఆయన మండిపడ్డారు. అరెస్ట్ అయిన వారిని మధ్యాహ్నం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.